# శిక్ష

మండు వేసవి సాయంత్రం అయిదు గంటల వేళ.

ఎండ ప్రభృతం తగ్గి చల్లనిగాలి వీచి ఎండకి సోలిపోయిన జీవకోటిని సేద తీరుస్తోంది.

వంటింట్లో కాఫీ కలుపుతున్న మాధవికి బెడ్ రూమ్ లోంచి భర్త పాడే ఈలపాట...సన్నగా వినిపిస్తోంది.

ఎంతో ఉత్సాహంగా ఉంటే తప్ప సారధి అలా ఈల పాట పాడడు.

భర్త ఉత్సాహానికి కారణం వెతుక్కుంటూ కాఫీ కప్పులతో భర్త దగ్గరికొచ్చింది మాధవి.

సారధి డ్రెస్సింగ్ టేబిల్ ముందు కూర్చుని పెర్ ఫ్యూమ్ "స్ప్రే" చేసుకుంటూ, పాట ఆపి భార్యకేసి చూసి చిన్నగా నవ్వాడు.

"ఏమిటో అబ్బాయిగారికింత ఉత్సాహం." కాఫీ అందిస్తూ అంది మాధవి.

"చెప్పుకో చూద్దాం!" నవ్వుతూ అన్నాడు సారథి.

"ప్రమోషనొచ్చిందా?"

"ఊఁహూఁ!"

"లాట్రీలో లక్షలొచ్చాయి."

"నేనసలు లాట్రీ టికెట్టే కొన్లేదు,"

"మరేమై వుంటుందబ్బా! ఉఁహూఁ! లాభంలేదు. మీారే చెప్పెయ్యండి."

"అయితే విను, ఈ రోజు డేటెంత?"

"పదిహేను."

"నెల?"

"మే!"

"అవునా? ఈరోజు మన శోభనం రోజు. నీకు పెళ్ళిరోజు గుర్తుంది. నాకేమో—"

"ఛీ సిగ్గులేదు" మాధవి చెంపలు కందిపోయాయి.

నలభై అయిదేళ్ళ మాధవి సిగ్గుల మొగ్గయి చేతుల్లో ముఖం దాచుకుంటే ఆరాధనగా చూశాడు సారథి.

"మధూ!"

"ఊఁ!"

"నీకు బోర్‌గా వుంది కదూ?" ఆమెని పొదివి పట్టుకుంటూ అన్నాడు సారథి.

"అవునండీ! ఎప్పుడూ అదిపెట్టు, ఇది పెట్టు అని చిరుతిళ్ళకి వెతికే పెద్దాడూ, ఇరవయ్యేళ్ళు వచ్చినా పసివాడిలా అమ్మకొంగు పట్టుకు తిరిగే చిన్నాడూ ఒకేసారి వెళ్ళిపోతే నాకేం తోచడంలేదు" భర్త బటన్స్ సరిచేస్తూ అంది మాధవి.

"బావుంది. చదువుకునేవాడూ, ఉద్యోగం చేసుకునేవాడూ ఎన్నాళ్ళుంటారు నీ దగ్గర? పోనీ...మంచి పిక్చరుంది వెళ్దామా?" అన్నాడు సారథి ఉత్సాహంగా.

"అలాగే!" అంది మాధవి భర్త అంత ఉత్సాహంగా ఎందుకున్నాడో అని ఆలోచిస్తూ.

సారథి, మాధవి సినిమా చూసి వచ్చేసరికి పదకొండు దాటింది.

గేటుతీసి లోపలికొస్తున్న మాధవి ఓపెన్ వరండాలో ఎవరో ఓ వ్యక్తి పడుకునుండడం చూసి తృళ్ళిపడింది భయంగా భర్తకేసి చూసింది. అయితే అతని మొహంలో ఎలాంటి కంగారూ లేదు.

తాళం తీస్తున్న చప్పుడుకి పడుకున్నతను తృళ్ళిపడి చటుక్కున లేచి నిల్చున్నాడు.

"ఎవరండీ!" కంగారుగా అంది మాధవి.

"దణ్ణాలమ్మా" అన్నాడా వ్యక్తి.

మాధవి అతనికేసి పరిశీలనగా చూసింది. దాదాపు యాభై యేళ్ళుంటాయతనికి. గడ్డం చింకిగా వున్నా దృఢంగా వున్నాడు.

"ఎవరు?" అన్నట్టు భర్తకేసి చూసింది.

"ఉండు" అన్నట్టు చూసి...

"నువ్వు పడుకో! పొద్దున మాట్లాడుకుందాం" అనేసి లోనికొచ్చాడు సారథి.

వీధి తలుపులు గడియవేసి గదిలోకొచ్చింది మాధవి.

"ఎవరతను?" మళ్ళీ అడిగింది.

"అతను ఓ దొంగ" తాపీగా అన్నాడు సారథి.

"ఏమిటీ?" తృళ్ళిపడింది మాధవి.

"అవును మధూ! అతను నిజంగా దొంగే" మంచం మీద కూర్చుంటూ అన్నాడు సారధి.

"కాస్త అర్థం అయ్యేలా చెప్పండి."

"ఇందులో అర్థంకాకపోవడానికేముంది మధూ, అతనో దొంగ! అంతేకాదు ఇతను నీకు తెలుసుకూడా!"

"నాకు తెలుసా?" తెల్లబోయింది మాధవి.

"అవును, నీకు తెలుసు. బాగా జ్ఞాపకం తెచ్చుకో. పాతిక సంవత్సరాల క్రిందట నీ మెడలోని నగ దొంగిలించడానికి ప్రయత్నిస్తే గంటసేపు అతనితో పెనుగులాడావ్!"

అదిరిపడింది మాధవి.

"...అంటే?"

"అవును. అతనే ఇతను!"

గబగబ వీధిలోకెళ్ళి చూసింది మాధవి లైట్ల వెలుగులో మరోసారి చూసిందతన్ని.

"అవును. అతనే కానీ, ఇప్పుడు యిక్కడి కెందుకొచ్చినట్లు?" భయంతో గుండె ఝల్లుమంది.

అదే భర్త నడిగింది.

"అతనో దొంగతనంచేసి దొరికిపోయాడు. జామీనిచ్చి తీసుకొచ్చాను."

మాధవి నిర్ఘాంతపోయింది.

మొన్నటిదాకా అతను గుర్తొస్తే చాలు నానాతిట్లుతిట్టే భర్త యిప్పుడతన్ని పనిమాలా విడిపించి తీసుకొచ్చాడంటే చిత్రంగా తోచిందామెకి.

"మీకు మతిపోయిందా? ఆ దొంగని..."

ఏదో అనబోతున్న భార్యని సున్నితంగా వారించాడు సారథి.

"ప్లీజ్ మధూ!" ఎందుకో అలా చెయ్యాలనిపించింది. చేసేశాను" మరోమాటకి అవకాశం యివ్వకుండా గోడకేసి తిరిగి పడుకున్న అతన్ని చూసి తెల్లబోయిందామె.

ఆమెకి గతం కళ్ళముందు నిల్చింది.

*　　*　　*

లక్షాధికారి జానకీరామయ్యగారి ముగ్గురు కూతుళ్ళలో ఆఖరిది మాధవి.

ఆమెకి చిన్నతనంనుంచీ అభిమానం ఎక్కువ! అనవసరంగా ఎవరి జోలికీ పోయేదికాదు. ఎవరయినా తననంటే పడేదికాదు. ఎవరితోనయినా మాటపట్టింపువస్తే వాళ్ళతో ఇంక జీవితంలో మాట్లాడేదికాదు. కలవారి బిడ్డయినా రవ్వంత గర్వం గానీ. అతిశయంగానీ వుండేవికావు.

"ఆడపిల్లకి అంత పట్టుదల పనికిరాదే!" అని తల్లి మొత్తుకునేది. అయినా ఆమె పట్టించుకునేది కాదు.

ఆడపిల్లలిద్దరికీ పెళ్ళిళ్ళుచేసి పంపి, మాధవిని చదువులో పెట్టారు జానకిరామయ్యగారు.

వారి యింట్లో ఓ గదిని ఆయన స్నేహితుని కొడుకైన సారథి కిచ్చారు.

అతను పేదవాడు. గ్రాడ్యుయేటేగానీ చిన్న ఉద్యోగి!

మితభాషి. ఈలపాట బ్రహ్మాండంగా పాడతాడు. అతని పాటంటే మాధవికి చాలా యిష్టం.

మాధవి అతనిదగ్గర తరచు పుస్తకాలూ అవీ తీసుకుంటూండేది.

మాధవికూడా గ్రాడ్యుయేషన్ పూర్తిచేసింది.

తండ్రి సంబంధాల వేటలో పడిపోయాడు.

ఒకటి రెండు సంబంధాలు పెళ్ళిచూపులదాకా వచ్చినా జాతకాలనీ మరేదో అనీ కుదరలేదు.

సారధికి మాధవంటే ఒక విధమైన ఆరాధన. ఆవిడ తన కందని పండని అతనికి తెలుసు. అందుకే తన ఆరాధన తన మనసులోనే సమాధి చేశాడు.

* * *

ఆరోజు మాధవి మేడమీద చివరి గదిలో పడుకుంది.

సాయంత్రం యేదో పేరంటం వెళ్ళొచ్చి మెడలోని రవ్వల నెక్లెస్ తియ్యకుండానే పడుకుంది.

ఆ నగ వారింటి నాలుగు తరాల్నించి వస్తోంది. అదీగాక అదంటే మాధవికి చాలా యిష్టంకూడా. అందుకే తరచూ ఆమే పెట్టుకుంటుందా నగ,

అర్ధరాత్రి తన మెడలోని నగ ఎవరో తీస్తున్నట్లనిపించి తృళ్ళిపడి లేచింది మాధవి.

చిరుచీకటిలో ఓ వ్యక్తి అస్పష్టంగా కనిపించి కెవ్వున అరిచింది.

వెంటనే బలిష్టమైన అతని చెయ్యి ఆమె నోరు నొక్కే-సింది. పరిస్థితి అర్థమయిన మాధవి పిచ్చి ధైర్యంతో అతన్ని వారించింది. పోరాడింది. అందినచోటల్లా కొరికింది. అయినా అతను నగ వదల్లేను. చివరికి నగ అతనిచేతుల్లో కొచ్చింది.

ఇది తరతరాలనుంచి వస్తున్న నగ. ఇది పోకూడదు" అనుకున్న మాధవి పిడుగులా అతనిమీద పడింది. అతన్ని చేతుల్తో చుట్టేసి పెద్దగా అరిచింది.

ఇద్దరి మధ్యా కొంతసేపు చిత్రమైన పోరాటం సాగింది.

చాలాసేపటితర్వాత నగ చేజిక్కించుకున్న దొంగ తలుపులు తీసుకుని బయటపడ్డాడు. మాధవి అరుపులకి లేచిన అందరూ కలిసినా అతన్ని పట్టుకోలేకపోయారు.

అయితే సెకెండ్ షో కెళ్ళొస్తున్న సారథి విషయం అర్థమై అతన్ని తెలివిగా పడేశాడు. ఇంతలో నలుగురూ కలిసి అతన్ని పట్టుకున్నారు పోయిందనుకున్న నగ దొరికింది.

అందరూ కృతజ్ఞతగా చూశారతనికేసి.

దొంగకేసి పరిశీలనగా చూసిన శ్యాంతా వాముకు-న వేలేసుకున్నారు.

అతనికి దాదాపు పాతికేళ్ళుంటాయి. మంచి స్ఫుర ద్రూపి. నల్లనిజుట్టు చెదరిపోయి, బట్టలు నలిగిపోయి వున్నా... అతనంతో అందంగా ఉన్నాడు.

"పెద్ద దొరలాగున్నావ్, దొంగతనం చెయ్యడానికి సిగ్గు లేదూ!" అన్నారెవరో.

అతను మాట్లాడలేదు. మౌనంగా తలవంచుకుని నిలుచున్నాడు.

జానకిరామయ్యగారు, మరికొందరు అతన్ని పోలీస్టేషన్‌కి తీసికెళ్ళారు.

అంతవరకు దొంగని చూస్తున్న 'అందరి కళ్ళు అతనటు వెళ్ళగానే మాధవికేసి తిరిగాయ్.

అంతే! అంతా నిర్ఘాంతపోయారు.

ఆమె చీర అస్తవ్యస్తంగా వుంది. జాకెట్ చిరిగిపోయింది. బుగ్గలు కాస్త గీరుకున్నట్లు, గాజులు పగిలినట్లు గుర్తులు కనిపిస్తున్నాయి.

అమ్మలక్కలు అదోలా మొహాలు చూసుకున్నారు.

తల్లి కొయ్యబారిపోయింది.

"అంటె! ముందు మాధవికి బట్టలుమార్చండి" అన్నాడు సారధి తేరుకుని.

కొయ్యబారిన ఆమెలో చలనంవచ్చి కూతుర్ని లోనికి తీసుకొచ్చింది.

ఆరోజు తర్వాత అమ్మలక్కలు తనని అదోలా చూడ్డం గమనించింది మాధవి. అయితే కారణంమాత్రం బోధపడలేదు.

అయితే దానికారణం ఓరోజు స్నేహితురాలి నోట విన్న మాధవి నిర్ఘాంతపోయింది. అప్పుడే వాళ్ళమ్మ, వదిన అంతా తనని కుతూహలంగా తొంగిచూడ్డం గుర్తొచ్చి కంపించిపోయింది.

"అంతే! తను వీళ్ళందరి దృష్టిలోనూ శీలం కోల్పోయిన కన్యన్నమాట.

మైగాడ్! రెండుచెవులూ మూసుకుని కంపరంగా అంటున్న మాధవిని జాలిగా చూసిందా స్నేహితురాలు.

"టేకిట్ ఈజీ...పాపం! నీ మనసు బాగా దెబ్బతిన్నట్టుంది" ఓదార్చబోయింది.

"అంతే?" చివ్వున తలతిప్పింది మాధవి.

"మధూ! ఇందులో నీ తప్పేంలేదని నాకు తెలుసే! కానీ" సానుభూతిగా అందామె.

మాధవి కళ్ళు ఎర్రబడ్డాయి.

"వాడ్డూయూ మీన్?" చటుక్కున లేచి తీక్షణంగా అంది.

"అనవసరంగా కోపం తెచ్చుకోకు మధూ! ఏదో చెడ్డ రోజులు."

"ఛీ! నా నగ లాక్కోవడం తప్ప అతనేం చెయ్యలేదు" చిరాగ్గా అంది మాధవి.

ఆమె నవ్వింది.

స్నేహితురాలి నవ్వు మాధవిని మరీ రెచ్చగొట్టింది.

"ఏం? నామాటమీద నీకు నమ్మకం లేదా?" కొట్టినట్టే అంది.

ఆమె మళ్ళీ నవ్వింది.

"నాకు నమ్మకం వుందా లేదా అన్నదికాదు ప్రశ్న. ఆ రాత్రి నీ రూపం, అతని వయసు, అతను నీగదిలో గడిపిన

సమయం తెలిసిన యెవ్వరూ నిన్నతనేం చెయ్యలేదంటే నమ్మరు" అదోలా అంద.

స్నేహితురాలుకూడా తనని నమ్మటంలేదని గ్రహించిన మాధవి మండిపడుతూ లేచి వచ్చేసింది.

ఆమె మనసంతా భారంగా అయిపోయింది.

తన బాధంతా తల్లికి చెప్పుకోవాలనీ, ఊళ్ళోవాళ్ళే కాక స్నేహితురాలు కూడా తనని అనుమానిస్తోందనీ చెప్పి, తల్లి ఓదార్పు మాటలతో ఊరట చెందాలనీ ఎంతగానో అనిపించిందామెకి.

"అలా వున్నావేమ్మా?" ఆప్యాయంగా అంది తల్లి.

ఎందుకో మాధవి కళ్ళు నీళ్ళతో నిండిపోయాయి. తల వంచుకుని యెలా ప్రారంభించాలా అన్నట్టు క్షణం మౌనంగా ఉండిపోయింది.

తల్లి ఆమె కేసి సూటిగా చూసి-

"మధూ!" అంది మెల్లగా.

"ఏమ్మా?" కంటి నీరు కనిపించనీకుండా అంది మాధవి.

"ఆరోగ్యం బాగా లేదా?" లాలనగా అంది తల్లి.

"అదేం లేదమ్మా! నా పరిస్థితి వింటే నువ్వు ఆశ్చర్యపోతావ్." స్నేహితురాలి మాటలు, ఆమె తల్లి వాళ్ళ చూపులు గుర్తొచ్చాయి మాధవికి.

తల్లి ముఖం పాలిపోయింది.

తల్లి ముఖంలోని నీలి నీడలు చూసిన మాధవికి లోకం తీరుమీద విపరీతమయిన కోపం వచ్చింది.

"పోనీయమ్మా! వెధవలోకం!" అంది కసిగా.

తల్లి మాట్లాడలేదు.

కాసేపు మౌనం తర్వాత-

"మధూ! సాయంత్రం డాక్టర్ దగ్గరికెళ్దాం" అంది మెల్లగా.

"ఎందుకు? ఒంట్లో బాగాలేదా?" అంది మాధవి ఆదుర్దాగా.

"ఉఁహుఁ! అదికాదు."

"మరి?"

క్షణం తటపటాయించి తల్లి.

"ఏమిటమ్మా?"

"నిన్ను...ఒకసారి డాక్టరుగారికి చూపించి..."

"ఎందుకు?"వింతగా చూసింది మాధవి. తల్లి మాటలేం అర్థం కావటంలేదామెకి.

"అదే...నీ...కు...నెల తప్పిందేమో...ఒక్కసారి లేడీ డాక్టర్‌కి చూపిస్తే...?" తడబడుతూ అనేసింది తల్లి.

పిడుగుపడ్డట్టు చూసింది మాధవి.

"నీ ఆరోగ్యం బాగాలేదు! నేను గమనిస్తూనే వున్నానమ్మా! అప్పుడే అందరికీ తెలిసింది కాబోలు."

"అమ్మా!" దిక్కులు పిక్కటిల్లేలా అరిచింది మాధవి.

"మధు! కోపం తెచ్చుకోకమ్మా! నీ బాధ నాకు తెలుసు. కానీ ఏం చేస్తాం భగవంతుడు మనల్నెందుకో పరీక్షిస్తున్నాడు, లేకపోతే అభం శుభం తెలియని నీకీ పరిస్థితేమిటి?" కంటనీరు పెట్టుకుంది.

మాధవి కళ్ళు నిప్పులు కురిశాయ్.

"నువ్వేం మాట్లాడుతున్నావో నీకర్థం అవుతోందా?" అంది కఠినంగా.

కూతుర్ని చూసి ఆమె కాస్త బెదిరింది. వెంటనే కాస్త తేరుకుని.

"అది కాదమ్మా!" ఇందులో నీ తప్పేంలేదు. అంతా ఆ దొంగ వెధవే..."

"స్టాప్." పిచ్చిదాన్లా అరుస్తూ చేతికందిన వస్తువులన్నీ చెల్లా చెదురుగా విసిరేసి తన గదిలో మంచంమీదికొచ్చి పడింది మాధవి.

"ఛీ! ఛీ! అందరిలాంటిదే తన తల్లి కూడా." అనుకుంది.

ఆలోచించి ఆలోచించి ఓ నిర్ణయానికొచ్చిన మాధవి, చటుక్కున లేచి సారథి గదిలోకొచ్చింది.

"రండి, రండి." కంగారుగా ఆహ్వానించాడు సారథి.

"నేనో మాటడుగుతాను. సూటిగా జవాబుచెప్పండి." అంది మాధవి ఎలాంటి ఉపోద్ఘాతమూ లేకుండానే.

"అడగండి!" అన్నాడతను బిత్తరపోతూ.

"నా గురించి మీ అభిప్రాయం యేమిటి?"

"అంటే..."

"సాయంత్రం నాకూ, మా అమ్మకీ మధ్య జరిగిన సంభాషణ వినే వుంటారు.

"విన్నాను."

"ఆరోజు దొంగతనం జరిగినప్పుడు కూడా మీరు న్నారు."

"అవును."

"మరి...మీరేమనుకుంటున్నారు?"

"దేన్ని గురించి?"

"అదే నా శీలాన్ని గురించి." కచ్చితంగా అంది మాధవి.

"ఛీ! ఛీ!...నేనలా అనుకోటంలేదు." కంగారుగానూ, గబగబానూ అనేశాడు సారధి.

"మీరెలా అనుకుంటున్నారు. ఆనాటి నా రూపం చూశారుగా?"

"నగకోసం పెనుగులాడ్డంతో అలాంటి సీన్ క్రియే టయిందని మీరప్పుడే చెప్పారుగా."

"అంటే నా మాటమీద మీకు పూర్తి నమ్మకం వుం దన్నమాట." యేదో ఆలోచిస్తూ అంది మాధవి.

"మీ మాటమీద నమ్మకం లేకపోతే నామీద నాకే నమ్మకం లేదన్నమాట." స్థిరంగా వున్నాయతని మాటలు.

"థాంక్స్! అయితే మీరు నాకో సాయం చెయ్యాలి"

"చెప్పండి."

"మీరు నన్ను పెళ్ళిచేసుకోవాలి.

అదిరిపడ్డాడు సారథి.

"ఏం వెనకాడుతున్నారా?"

"నో! నో! అదికాదు, నేను పేదవాణ్ని."

"ప్రస్తుతం నేనూ పేదదాన్నే! నాకు కావాల్సింది మీరు. నేను నేనుగా మీకక్కర్లేదా?"

"నేనారాధించే వ్యక్తి చేరువైతే కాదని కాలదన్నే వెర్రివాణ్ణికాదు నేను" మెరుస్తున్న కళ్ళతో అన్నాడు సారథి.

"థాంక్స్" గిరుక్కున వెళ్ళిపోయింది మాధవి.

కూతురి నిర్ణయం విన్న తల్లిదండ్రులు ముందు తెల్లబోయారు. తర్వాత ఆమె స్వభావం పట్టుదలా తెలుసు గనుక తప్పనిసరిగా కూతుర్ని సారథి చేతిలో పెట్టారు.

పెళ్ళవగానే కట్టుబట్టలతో భర్తని తీసుకుని బయట కొచ్చేసిన మాధవి యెన్నో కష్టాల్ననుభవించింది. ఆర్థికంగా బాధపడుతున్న భర్తకెంతో చేదోడు వాదోడుగా వుండి అతనికెంతో ధైర్యం చెప్పింది.

ఇద్దరు పిల్లలకి తల్లయింది.

ఏదో కాస్త ఆస్తి కలిసిరావడంతో చిన్న వ్యాపారం ప్రారంభించి అతి త్వరలో ధనవంతుల జాబితాలో చేరిపోయాడు సారథి. కాలం హాయిగా దొర్లిపోతోంది.

సారథి ఇద్దరు కొడుకులు మేజర్లయ్యారు. అయితే సంవత్సరాలు దొర్లినా కష్టాల్లోను, సుఖాల్లోను యెప్పుడూ పుట్టింటి కెళ్ళలేదు మాధవి.

పాతికేళ్ళక్రితం తారసపడ్డ ఆ దొంగ మళ్ళీ యిక్కడికి రావడంతో గతమంతా కళ్ళముందు నిల్చింది ఆమెకి.

ఎంత ఆలోచించినా భర్త అతనికెందుకు సాయంచేస్తూ వున్నాడో మాత్రం అర్థంకావడంలేదామెకి. కానీ, సహజంగా సంతోషించిపోయింది.

అయితే భర్త ఆ దొంగ తరఫున ఓ ప్లీడర్నిపెట్టి ఎంతో డబ్బు ఖర్చుపెట్టి మరీ విడుదల చేయించాడని తెలిసినప్పుడు మాత్రం సహించలేకపోయింది.

"అతన్ని విడుదల చేయించారటగా?" తీక్షణంగాఅంది.

"అవును."

"ఏం? అతను దొంగతనం చెయ్యలేదా?"

"చేశాడు!"

"మ..?"

"......"

"చెప్పండి! మౌనం సమాధానం కాదు" అరిచింది.

"ఆ దొంగ నాకెంతో మేలుచేశాడు"

"మీకు, ఆ దొంగ మేలుచేశాడ?" ఆశ్చర్యంగాఅంది.

"అవును. అతను చేసిన మేలు జీవితాంతం మర్చిపోలేను. ఎస్! నిన్ను నూటికి నూరుపాళ్ళు ప్రేమిస్తున్నాను. ఆరాధిస్తున్నాను" ఉత్సాహంగా అన్నాడు సారధి.

"బావుంది. ఈ ప్రేమలు దోమలూ పాతికేళ్ళనుంచీ ఉన్నవే! హఠాత్తుగా ఏమొచ్చింది?" చిరాగ్గా అంది మాధవి.

"నిజమే! కానీ ఈ ప్రేమలో ఏదో కాస్త కోరికవుంది. ఇప్పుడవన్నీ మాయమై పూర్తి ప్రేమ అంటే నూటికి నూరుపాళ్ళు నీలాంటి భార్య లభించినందుకు గర్వపడుతున్నాను."

"ఇదేదో సీరియస్ మేటర్లాగే వుందే" వ్యంగ్యంగా అందామె.

"అవును" నవ్వాడతను.

"సరే! ఉన్నమాటన్నట్టు నాతో చెప్పకపోతే నామీద ఒట్టు" పట్టుపట్టింది మాధవి.

అతను ప్రారంభించాడు.

"పాతికేళ్ళనాడు మన పెళ్ళయినదగ్గర్నించీ కొండంత సంతృప్తితోపాటు రవంత అసంతృప్తికూడా వుండేది నాకు.

నీదగ్గరకొచ్చినప్పుడల్లా ఆ దొంగ గుర్తొచ్చేవాడు అందమైన ఈ మెడ అతను తాకాడు. సున్నితంగావున్న ఈ చేతులు అతన్ని చుట్టేస్తే...సంపూర్ణ యవ్వనంలో వున్న ఆ యువకుడు నిన్నేం చెయ్యకుండా కేవలం గొలుసు మాత్రమే తీసికెళ్ళుంటాడా అన్న అనుమానం నన్ను పీడిస్తూండేది. వెంటనే నీ స్వభావం, నిజాయితీ గుర్తొచ్చి ఆ భావాన్ని వెనక్కి నెట్టేసేవాణ్ణి.

మళ్ళీ మామూలే!

పాతికేళ్ళుగా నాలో నేను పడే యీ చిత్రహింస ఈ మధ్య కాలంలో పటాపంచలయిపోయింది.

ఇతను దొంగతనం చేసినప్పుడు నేను అక్కడేవున్నాను. వాడు చేసింది చిన్న దొంగతనమే అయినా పెద్ద శిక్ష వేయించాలి. అదీ నా కోరిక! కారణం అతన్ని నేను గుర్తించడమే.

నా ఫ్రెండ్ ద్వారా అతని పుట్టుపూర్వోత్తరాలు తెలుసుకున్నాను.

అతను దొంగే! చిన్నతనంనుంచీ అతనివృత్తి అదే.

అతనికి పదిహేనోయేటంటే ఇప్పటికే దాదాపు ముప్ఫయ్యయిదు సంవత్సరాల క్రితం ఓ దొంగతనంచేసి పారిపోతూ ఓ మేడమీంచి పడిపోతే అతనికి వెన్నుపై తగులరాని

చోట తగిలిన కారణంగా లైంగిక జీవితానికి పనికిరాడని డాక్టర్లు చెప్పారట. అదంతా అతని రికార్డులోవుంది.

ఆ తర్వాత పదేళ్ళకి నీ నెక్లెస్ దొంగిలించాడు. అంటే వాడు నిన్నేంచెయ్యలేదన్నమాట!

మైడియర్ మధూ! ఇప్పుడు నాకెంత తృప్తిగా వుందో తెలుసా? నా ఈ తృప్తికారకుడైన ఆ వ్యక్తిని ఆదుకోవాలనిపించింది. జైలుకి పంపాలనుకున్న నేనే బోల్డుడబ్బు ఖర్చుపెట్టి అతనికి శిక్షపడకుండా చూశాను."

"ఉత్సాహంగా చెపుతున్న సారథి భార్యముఖం చూసి తటుక్కున ఆపేశాడు.

మాధవి ముఖం నెత్తురుబొట్టు లేనట్టు పాలిపోయింది. పెదవులు కంపిస్తున్నాయి.

"ఏమిటి మధూ! షాక్ గావుందికదూ?చూశావా మనిషి మాత్రం ఇంకా అందంగానే వున్నాడు" అన్నాడు సారథి.

పాతికేళ్ళనాటి అమ్మలక్కల చూపులు, స్నేహితురాలి మాటలు, అమ్మ అనుమానం అన్నీ సినిమారీల్లా కనిపిస్తున్నాయి.

"ఏమిటి మాధవీ!" భార్య ముఖం చూసి కంగారుగా పిల్చాడు సారథి.

వాస్తవంలోకొచ్చిన మాధవి భర్తకేసి సూటిగా చూస్తూ "మీకు ఇన్నాళ్ళు నాతో కాపురం చేస్తున్నా నా మీద నమ్మకం కలగనేలేదా?" అంది.

"ఛీ! ఛీ! నమ్మకమా పాడా? కేవలం మానవబలహీనత. ఎంత నీ మనసు తెలిసినా అప్పుడప్పుడు కోతి మనసు కాస్త చేసేవంతే. తేలిగ్గా నవ్వేస్తూ అన్నాడు సారథి.

మాధవికూడా నవ్వింది.

"నిజం...మనసు కోతిలాంటిదే! ఒక్కోసారి మరీ అల్లరి చేస్తూంటుంది! కదూ?"

"అవును! ఇలా!..." ఆమెని చేతుల్లో చుట్టేస్తూ చిలిపిగా అన్నాడు సారథి.

"ఆగండి సర్! నాకోతి మనసుందే! అది ప్రస్తుతం మీ మాట వినదు." అతని కౌగిలి సున్నితంగా విడిపించుకుంటూ అంది మాధవి. "నో!నో! అదేంకుదరదు. మబ్బు తెరలువిడిపోయి పండు వెన్నెల నిండిపోయిన ఈ శుభ సమయంలో దేవిగారు మాకో మంచి కానుక ఇవ్వాలి." అల్లరిగాఅన్నాడు సారథి.

మాధవి మళ్ళీ నవ్వింది.

"తప్పకుండా ఇస్తాను." ఓరగా చూస్తూ అంది.

"మరింక ఆలస్యం దేనికి?" ఆమె చెంపకి పెదవులానిస్తూ అన్నాడు సారథి

"కానీ, ఇప్పుడుకాదు."

"ఉఁ మరెప్పుడూ?" గోముగా అన్నాడతను.

"రేప్పొద్దున." నవ్వుతూ అంది మాధవి.

మధురమైన ఆమె నవ్వుకు పులకించిపోయిన సారథి "ఉఁహూఁ. కాదు! ఇప్పుడే." అన్నాడు అమెను కౌగిట్లోకి తీసుకుంటూ.

"ప్లీజ్! లీవ్‌మీ ఎలోన్." అతన్నించి దూరంగా జరిగి వేడుకోలుగా అంది మాధవి.

ఆమె కళ్ళలోకి చూసిన సారథి-

"ఓ.కే. ఉఁ! కానీ...రేపు ఇవ్వనంటే మాత్రం ఊరుకునేది లేదు." అన్నాడు బుంగమూతిపెట్టి.

"మాట తప్పను." చిన్నగా నవ్వి అంది మాధవి.

* * *

పాలవాడి కేకకి తృళ్ళిపడి లేచిన సారథి తలతిప్పి భార్య కేసి చూశాడు.

ఆమె హాయిగా నిద్రపోతోంది.

"ఆలోచనలతో రాత్రి నిద్రపోయుండదు." అనుకున్న సారథి లేచి పాలు పోయించుకొన్నాడు.

అయిదింటికే లేచి కాఫీ కప్పుతో మేలికొలిపే మాధవి అంతవరకు లేకపోవడంతో సారథికేం తోచలేదు. ఏదో ఆలోచించి గబగబ కాఫీ కలిపి కప్పుతో తీసుకొచ్చి-

"గుడ్ మార్నింగ్ మేడమ్" అన్నాడు తమాషాగా.

మాధవి లేవలేదు.

"డియర్!" అంటూ తట్టి లేవబోయిన సారథి కొయ్యబారిపోయాడు. మాధవి శరీరం మంచులా వుంది.

"మధూ!" కంగారుగా కుదిపాడామెని.

జీవంలేని ఆమె శరీరం అతనికేదో సంకేతాన్నందజేసింది.

కుప్పకూలిపోయిన సారథికి టేబిల్ లైట్ కింద రెపరెపలాడుతున్న కాగితం కనిపించి ఒణికే చేతులతో తీసుకుని మడత విప్పాడు.

నీటితో మసగబారిన కళ్ళు అక్షరాలవెంట పరుగులు తీశాయి.

మీకు!

ప్రియమైన అని రాయాలని ఎంతగానో ప్రయత్నించి ఓడిపోయాను. మన్నించండి.

మన పెళ్ళి ఎలాంటి పరిస్థితుల్లో జరిగిందో మీకు గుర్తుండే వుంటుంది.

ఏ మాట విని నేను క్రుంగిపోయానో, ఏ మాటవిని కన్నవారిని సహితం వదులుకున్నానో ఆమాట...మళ్ళీ పాతి కేళ్ళ తర్వాత మీ నోట విన్నాను.

నాతో స్నేహంచేసిన నా స్నేహితురాలు నామాట నమ్మలేదు. నా స్వభావం ఎరిగిన ఇరుగు పొరుగులు నమ్మలేదు. ఆఖరికి నన్ను కని పెంచిన నా తల్లి దండ్రులే నన్ను నమ్మలేదు.

అప్పుడు నా మనసు క్రుంగిపోయింది. ఒడ్డునపడ్డ చేపలా గిలగిల్లాడిపోయాను.

ఆ సమయంలో ఎడారిలో ఒయాసిస్సులా మీరు కనిపిం చారు. మీ ఆదరణలో సేద తీర్చుకున్నాను. మీరే నా సర్వ స్వంగా భావించాను.

కానీ నేను ఒయాసిస్సుగా భావించింది నిజంగా నీరు కాదనీ, నీరులా కనిపించే ఎంటమావి మాత్రమేననీ ఇప్పుడూ ఇన్నేళ్ళ తర్వాత తెలుసుకున్నాను.

కానీ, ఇప్పుడు నేనేం చెయ్యగలను? మునుపటి ఆత్మ స్థయిర్యం లేదు. ఈ షాక్ నించి తేరుకునే శక్తిగాని, ఆశగానీ అసలు లేవు.

చిత్రం ఏమిటంటే ఇప్పుడు పడ్డంత బాధ మును పెప్పుడూ పడలేదు.

వాళ్ళందరూ...నా మొహంమీద తమ అనుమానాన్ని బయట పెట్టారు.

కానీ...మీరు? మనసులో ఘోరమైన అనుమానాన్ని

దాచుకుని, ప్రాణంలో ప్రాణం అన్నట్టు నాతో పాతికేళ్ళు కాపురం చేశారు.

అంటే మీరు పాతికేళ్ళపాటు నటించారన్నమాట. నిజంగా అందరికన్నా మీరే గొప్పవారు. అందరిలా కాక అణువణువునా అనుమానాన్ని దాచుకుని, ఇన్నేళ్ళు మనుగడ సాగించారు.

ఇంతకన్న అసహ్యకరమైనపని నాదృష్టిలోమరొకటిలేదు.

అందుకే నేనీ లోకంనుంచే తప్పుకుంటున్నాను. అంతకన్నా మరో మార్గం కూడాలేదు. మీలా నేను నిజజీవితంలో నటించలేను.

విషవృక్ష సముదాయాన్ని నందనవనంలా భ్రమసిన మూర్ఖురాల్ని. ఇంతకన్నా ఏం చెయ్యలేను.

రేపు నా పిల్లలొచ్చి "అమ్మకేమైంది?" అనడుగుతారు. ఏం చెప్తారు? ఉన్నదున్నట్టు చెప్తారో, మరో కథ అల్లి వాళ్ళదగ్గరకూడా నటిస్తారో మీ ఇష్టం.

నేను మీకు శాశ్వతంగా దూరం అయిపోతున్నాను. మీరు వాళ్ళతో నిజం చెప్తే మరో రకంగా వాళ్ళు దూరం అయిపోతారు. పాపం! విషమ పరిస్థితి.

ఒక దొంగని శిక్ష నుంచి కాపాడలని కంకణం కట్టుకుని కృతకృత్యులయ్యారు. కానీ...అదే ప్రయత్నంలో...మీరు పెద్ద శిక్ష అనుభవించబోతున్నారు.

అవును. అదే! అదే! అదే! మీకు తగిన శిక్ష!

నిజజీవితంలో నటించేవారంటే అమితంగా అసహ్యించుకునే సుఖవి.

( వనితాజ్యోతి )

సమాప్తం